# గుంయి గుంయి గురివి

ఈ కత నా ముక్య చేహితురాలు గురివిది !

గురివిని గుంయి గుంయి గురివి అని అంటాం !

ఎందుకంటామో చెప్పడానికే ఈ కతలో మతం. గురివి నర్సుల్లో సేరింది యుద్దం మొదలెట్టగానే. ట్రయినింగు కాంగానే దాన్ని డిశ్చార్జి చేశారు. ఎందుకంటే ఎప్పుడూ దాని సెవుల్లో గుంయి గుంయి మంటుందని కంప్లేంటు సేసేది. ఓసారి ఓ ఆపరేషన్ చేత్తుంటే అదేందో పళ్ళెం పట్టుకుని డాక్టరు పక్క నుంచుని నుంచుని సెవులో గుంయి గుంయి మంటున్నదని ఆ పళ్ళెం అక్కడే పడేసి పోయిందంట.

మర్నాడే డిశ్చార్జి.

నిజానికి దానిమొగం, అది సమత్తాడింది పద్దాలుగోయేట. అప్పట్నుంచీ దానికి సెవులో గుంయి గుంయి మంటూండేది. అదెవరికీ తెలీలేదు.

గురివికి కూడా అప్పుడే తెలీలేదు.

ఓసారి ఓ క్యాప్టెను సెలవు తీసుకుని బెంగుళూరు పార్కులో గురివితో చేహం సేశాడు. ఇద్దరూ ఓ బల్లమీద కూకున్నారట. "కబుర్లు సెప్పుకుందాం?" అన్నాట్ట క్యాప్టెను.

"గుబులుగా ఉందా?" అన్నట్టు వినబడి "వద్దు" అందిట గురివి.

రెండో చాన్సు ఇవ్వకుండా అదేపోత పోయాడు క్యాప్టెను.

అప్పుడు తెలుసుకుంది గురివి సెవులో గుంయి గుంయి రోగం ఉందని. అయితేనేం మిలిటరీ ఉద్యోగం చేద్దామని బాగావుంది దానికి.

మిలిటరీ చేరింది, డిశ్చార్జి అయింది.

పందొమ్మిదేళ్ళంటాయి. నిత్యం ఆ గుంయి గుంయి అంటూ నీరశించిపోతున్నది పిల్ల. చివరకన్నాను నేను, "పిల్లా! ఎందుకు కష్టపడతావు—యవ్వనం వృదా సేసుకుంటావ్? ఏం లాబం! క్యాప్టెన్లూ లెప్టెనెంట్లూ సీవొంకే చూత్తున్నారని అనుకోడమేగాని అది నీ గుంయి గుంయివల్ల వచ్చిన వృదా ఆలోచన్లే. ఆలోచించు నువ్వే."

సరేనని ఓ రోజు ఓ డాక్టేరుకు సెవి సూపింది. ఆయన "సేరు సేరు పేసు పొడరుంది పాతన్లేసినట్టుగా నీ సెవులో!" అని బుస్సు బుస్సుమని పైకొచ్చేట్టుగా నురుగులు తీశాడు. పైగా తాగడానికేందో మందిచ్చి పంపాడు. ఆ మందును సూసి దాని చిన్నతమ్ముడు సంతోసించాడేగాని దానికి రోగంకుదర్లా.

ఇట్లాగే ఎంతోమంది డాక్టర్ల సేత పడ్డది. రోగం మాత్రం కుదర్లేదు.

"మళ్ళీ మిలిటరీ సేరుతా?" అని పూనాపోయింది గురివి.

నేను నా బటాలియన్‌తో సికింద్రాబాదు పోయాను.

ఓ నాడు బజారెళ్తున్నా. ముందొక సోల్జరుగాడితో సెయ్యీ సెయ్యీ పట్టుకుని గురివి పోతున్నది. సివిలుబట్టలే కట్టింది, పారిపోయొచ్చిందేమో అనుకున్నా. వెంటబడ్డా.

దాని జిమ్మతియ్యా! ఇద్దరూ సందులూ గొందులూ దాటారు. యే సాపులో కెళ్ళినా యనక్కాతిరిగిసూడదు. చివరకు ఓ టీ సాపులో కెళ్ళారు. టస్సాకొయ్యా అక్కడ కూడా వెన్నులు గేటువేపే పెట్టి కూకున్నారు. సరే! నేగూడా టీకని లోపలికిపోయాను. నిజమే గురివే. ఆపక్కోడు సోల్జరు గాడే నవరో! నాగజెముడు పండల్లే ముక్కూ, గొంగళి పురుగల్లే మీసం!

"ఏమోయి అగ్గురారబ్బడితా! ఇక్కడున్నావా?" అంటూ నా బిల్ల దగ్గిర కొచ్చింది.

"నువ్వేం పారిపోయి రాలేదు గందా?" అని అడిగాను.

"ఛీ లేదోయి" అంటూ ఆ సోల్జరేపుసూసి "డార్లింగ్ పిక పిక్! మై ఫ్రెండ్ అగ్గురా రబ్బడితాయ్!" అని నన్ను సూపింది.

"అగ్గుర్ వాట్? అగ్గుర్ అగ్గుర్ వాట్? వై ఛే మినిట్!" అంటూ ఆ బొల్లి ముండాకొడుకు లేచి వెళ్ళిపోయాడు. పోతూ "అగ్గుర్, అగ్గుర్! గాడ్! డాం ఇట్!" అనుకున్నాడు.

"వాపేరంటే ఆడికంత కష్టమా! నాదేశం ఎందుకొచ్చాడూ?" అనుకున్నాను నేను.

డార్లింగనేమాట నాకూ తెలుసు! "డార్లింగు! మరి నువిక్కడికెందు కొచ్చావు? సివిలు గుడ్డల్లో వున్నావేం?" అని అడిగాను.

"పారిపోయి రాలేదోయి. ఆ గుంయి గుంయి పోలేదు. దాంతో మాట్రబుల్‌గా వుంది. మళ్లీ డిస్చార్జిసేసారు. వత్తూంటే ఓ కొత్తగా సేరిన లెఫ్టినెంటుతోగూడా యీ వూరొచ్చా!"

"ఆయనకూ నీకూ యవారం ఏంలేదు గందా!"

"ఛీ ఛీ యవారాలు పెట్టుకొనేదాన్నో కాదో నీకు తెలీదూ?"

"నిజమే తెలుసు. అయితే యీ తెల్లమొగాన్నెక్కడ పట్టావు?"

ఈవూళ్ళో నాల్రోజులున్న తర్వాత "డార్లింగ్ నా సెలవై పోయింది నే పోతా" అని ఆ లెప్టినెంటు పోయాడు. ఆనాడిక్కడ పార్కులో అటూ ఇటూ తిరుగుతున్నా. "కూయి కూయి" అంటూ ఈడొచ్చాడు. ఈలవేశాడు. నా కర్థంకాలేదు. "డార్లింగ్ వాటీజ్ యువర్ నేమ్" అన్నాడు. "మిస్ గురివి" అన్నాను. "డార్లింగ్ గుర్ గుర్" అన్నాడు. ఇద్దరం నవ్వాం. అక్కడె బెంచీమీద కూకున్నాం. "డార్లింగ్ టీ" అన్నాడు. "ఆల్‌రైటు" అన్నాను. బజారొచ్చాం. ఓ పౌంటెన్ పెన్‌కొని ప్రెజంటు సేశాడు. ఆడ్నుంచి ఓ సందులో ఇల్లుంటే పోయాం. కాసేపు కూకున్నాం. "డార్లింగ్ నీ జాకెట్ కొలత తీసుకోనీ. గుడ్డకొని మిషన్ వాడికిద్దాం"అన్నాడు. "ఆల్ రైట్" అన్నాను.

కొలత కొలిచాడు. లేచాం, గుడ్డల కొట్లోకెళ్ళాం. జాకెట్ గుడ్డ కొన్నాం. మిషినోడి దగ్గరకు పోయాం. ఆడు నన్ను కొలుచుకుంటావన్నాడు. "ఏంటి?" అని తెల్లోడడిగాడు. "నన్ను కొలుచుకుంటాట్ట" అన్నాను. "పళ్ళు రాలకొడతాను అని చెప్పు—ఇదిగో కొలత" అన్నాడు. కొలత ఇచ్చాం. సరాసరి టీ కొచ్చాం. అక్కడ నువ్వు కనబడ్డావ్. ఇందులో తప్పేంటి సెప్పు."

"నువ్వు సేసేదాన్లో తప్పుంటుందా డార్లింగ్?" అన్నాను."మరేంటి! ఏంసేద్దాం! ఎక్కడి కెల్దాం?" అని అడిగాను.

"అరెరే" అన్నది గురివి.

"ఏంటి ఏంటి?" అని అడిగాను.

"ఛీ ఛీ! ఇప్పుడేనా ఇట్లా అవడం!" అన్నది.

"ఏంటి ఎట్లా అయింది?" అని అడిగాను.

"సెప్పడానికి సిగ్గవుతుందోయి" అన్నది.

"నీకు సిగ్గేంటి గురివీ!" అన్నాను.

"సెప్పుతానుండు. మరే....!" అని ఊరుకున్నది.

"సెప్పు సెప్పు. దాచుకోకు!" అన్నాను.

"దాచుకుంటే ఎట్లా జరుగుతుంది! సెపుతా" అన్నది.

"జాకెట్ లోపల బాడీ బనీను పగిలింది డార్లింగ్" అన్నది.

"ఇంతేనా! సైజు చెప్పి ఓ అరడజన్ తీసుకుందాం పదా" అన్నాను.

పోయాం ఓ సాపులోకి. సాపు కుర్రాడికి సెప్పాం ఏం కావాలో.

"మీ సైజెంత మేడం ?" అన్నాడు కుర్రాడు.

"నాకు 32 సైజు కావాలి" అన్నాను.

"నా ఉద్దేశం మేడంకు 36 సైజు కావాలనుకుంటాను" అన్నాడు.

"నో ! నాకు 32 సైజే కావాలి !" అంది గురివి.

"నో మేడంకు 36 సైజ్ ఫిట్" అన్నాడు కుర్రాడు.

"ఏంటి నీ మాటలు! నా సైజు నాకే తెలీదనుకుంటావా?"అంది గురివి.

"ఏడేండ్లనుంచీ బాడీ బనీన్లమ్ముతున్నా. ఏ మనిషి కేసైజో నాకు తెలీదనుకున్నావా?" అన్నాడు కుర్రాడు.

"నీ మాటలు పెడసరంగా ఉన్నాయి. అవి కట్టెట్టి నేనడిగిన సైజు నాకిచ్చి పంపించు. అన్‌డర్‌స్టాండ్ ?" అన్నది.

అంటూ నాతో అన్నది "పద్దాలుగేండ్ల ఈడునుంచి సైజు 32 తొడుక్కుంటున్నా. ఇప్పు డిరవై యేగా నా యీడు !"

"అల్‌రైటు! నాకేం ఇస్తాను! అయితే 36 సైజువాళ్ళు 32 సైజు వేసుకుంటే చెవులల్లో గుంయి గుంయి మంటుంది. తెలీదా ?" అన్నాడు సాపు కుర్రాడు.